నిర్మాణం పూర్తి చేయలేని పాలన!

తెనాలిఅర్బన్: పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తు రోగులకు సరైన మౌలిక వసతులు కల్పించలేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీటి నిర్మాణం కోసం నిధులు వెచ్చించినా.. కూటమి ప్రభుత్వ పాలకులు వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

జగనన్న పాలన ప్రజలకు ఏం అవసరమో వాటిని చేసి చూపింది. ప్రధానంగా విద్య, వైద్యం వంటి అంశాల్లో నాటి పాలకుల ముందుచూపు అందరూ హర్షించేలా ఉండేది. వారి పాలనలో బీజం వేసుకుని తెనాలిలో ఆరంభమైన పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఇవాళ తమ గోడు వినే నాథుడి కోసం పరితపిస్తున్నాయి. తమ నాడి పట్టుకుని చూసే యంత్రాంగం కోసం ఎదురుచూస్తున్నాయి.


చంద్రబాబునాయుడు కాలనీలో నిర్మాణ దశలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్

ప్రజలు నివశించే ప్రాంతంలోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెనాలి పట్టణంలోని అయితానగర్, సుల్తానాబాద్, కొత్తపేట, మారీసుపేట, పాండురంగపేటలలో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఆ సమయంలో వాటి నిర్వహణ కోసం ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకోవటంతో పాటు వైద్యులు, సిబ్బందిని నియమించింది. అలాగే రోగులకు అవసరమైన ల్యాబ్‌లు, మందులను అందుబాటులో ఉంచి అక్కడకు వచ్చిన వారికి అన్ని పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో చిన్న అనారోగ్యానికి జిల్లా వైద్యశాలలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. దీంతో సమయం, రవాణా చార్జీలు ప్రజలకు మిగలటంతో వీటి ఏర్పాటుపై ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

- ప్రశ్నార్థకంగా మారిన అర్బన్ సెంటర్ల భవన నిర్మాణ పనులు
- కూటమి పాలనలో అడుగు పడని వైనం
- నేటికీ అద్దె భవనాల్లోనే నిర్వహణ
- అర్బన్ హెల్త్ సెంటర్లకు చికిత్స అవసరం


మారీసుపేటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్

శాశ్వత భవనాల కోసం రూ.5.50 కోట్ల నిధులు

తెనాలిలోని అయిదు అర్బన్ హెల్త్ సెంటర్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం భావించి ఒక్కో భవనానికి రూ.1.10 కోట్ల నిధులు వెచ్చించింది. పట్టణంలోని ఐదు భవనాలకు రూ.5.50 కోట్లు వెచ్చించి త్వరగా నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంది. దీంతో పాత ప్రభుత్వ వైద్యశాలలో ఒకటి, అయితానగర్ నేలపాడు వెళ్లే రోడ్డులో మరొకటి, సుల్తానాబాద్‌లో ఒకటి నిర్మించి దానిలోకి అర్బన్ హెల్త్ సెంటర్లను మార్చి సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. అప్పటి నుంచి శాశ్వత భవనాలలో అవి కొనసాగుతున్నాయి. ఆ ప్రాంతంలోని పేదలు అక్కడికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.

ఆదిలోనే హంసపాదు!


ఆలపాటినగర్‌లో నిర్మాణ దశలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్

చంద్రబాబు నాయుడు కాలనీ, ఆలపాటి నగర్‌లో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌లు నత్తనడకన సాగుతున్నాయి. ఆలపాటి నగర్‌లోని భవనాన్ని గత ప్రభుత్వంలోనే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన ఫ్లోరింగ్, ర్యాంప్, ఇతర చిన్న, చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.10 లక్షల పనులు దీనిలో పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. చంద్రబాబు నాయుడు కాలనీలో గ్రౌండ్ ఫ్లోరింగ్, రంగులు, టాయిలెట్స్‌లో పనులు వంటి రూ.20 లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల మాట. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని విస్మరించడంతో ప్రస్తుతం వాటికి తాళాలు వేసి అలానే ఉంచారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చివరి దశలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నెలలో పనులు పూర్తి చేయిస్తాం



చంద్రబాబు నాయుడు కాలనీ, ఆలపాటి నగర్‌లో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలు చివరి దశలో ఉన్నాయి. మిగిలిన పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెలలోపు వాటిని అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉన్నాం. పనులు పూర్తి కాగానే అర్బన్ హెల్త్ సెంటర్‌లను వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగిస్తాం.

–ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో జీవించండి



తెనాలిఅర్బన్: ఆధ్యాత్మిక చింతనతో మహిళలు జీవించాలని రక్షణసైన్యం చర్చి ప్రతినిధి కల్నల్ సుమిత్ర మాసి పేర్కొన్నారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం ప్రార్థన మందిరంలో మంగళవారం స్త్రీలకూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు జ్ఞానం కలిగి ప్రార్థన శక్తిని కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో లెఫ్టినెంట్ కల్నల్ సీయోను కుమారి, మేజర్లు రత్నసుందరీ, రాజాకుమారి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

31న కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



తెనాలిఅర్బన్: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బోసురోడ్డులోని దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరుని పూజ, 6.15 గంటలకు వైశ్య పతకావిష్కరణ జరుగుతాయని చెప్పారు. 8 గంటలకు 102 గోత్రముల ఆర్య వైశ్య కన్యలచే, కలశలతో శోభాయాత్ర, 8.30 గంటలకు హోమం, 10.30 అభిషేకం, అలంకరణ, అర్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు ప్రజ్ఞానంద సరస్వతీ (బాలస్వామిజీ) పర్యవేక్షణలో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వాసవీ మాత కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కోనిజేటి గోపికృష్ణ, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు, నందం రజనికుమార్, వుప్పల వరదరాజులు, మువ్వాల శ్రీనివాసరావు, అమర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అదాలత్



తెనాలిరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించిన వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సీజీఆర్ఎఫ్ పని చేస్తుందని ఆ ఫోరం చైర్మన్ ఎం. విక్టర్ ఇమ్మానియేల్ తెలిపారు. స్థానిక ఓవర్ బ్రిడ్జి వెంబడి ఉన్న ఎస్ఎల్ఎస్ ఫంక్షన్ హాలులో విద్యుత్తు అదాలత్ అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. విజయవాడకు చెందిన కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్ కార్యక్రమంలో వినియోదారులిచ్చిన 20 ఫిర్యాదులను పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఫోరం చైర్మన్, ఫోరం సభ్యులు, అలాగే గుంటూరు జిల్లా విద్యుత్ ఎస్ఈ కేవీఎఎన్ మూర్తి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామిరెడ్డి, తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో జరిగింది. విద్యుత్ వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుల్లో ఎక్కువగా.. లో వోల్టేజీ, మీటర్లు డిఫెక్ట్, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్ ఫారంలు,లో వోల్టేజీ ,హై వోల్టేజీ వంటి అనేక సమస్యలు రాగా వాటిని వెంటనే పరిష్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



నిజాంపట్నం: ఇటీవల నిజాంపట్నం హార్బర్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని ప్రమాద బాధితులకు మంగళవారం పలువురు దాతలు చేయూతనిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మూడు కుటుంబాల బాధితులకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వస్త్రాలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కాళ్ళేపల్లి గౌరీశంకర్, జాయింట్ సెక్రటరీ దబ్బకూటి బసవరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, నాయకులు పీతా సాయిబాబు, మీరయ్యలు బాధితులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయుడు గోపీ, వెంకటేశ్వరరావు, గంగరాజు, సునీల్, సుందరరావు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు (కొల్లూరు): పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు పంపిణీ కార్యక్రమం మంగళవారం భట్టిప్రోలులో నిర్వహించారు. చేనేత వస్త్ర వ్యాపారి పాలకుర్తి సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమార్తె మానేపల్లి లక్ష్మి సరోజని సహకారంతో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పాల్గొన్నారు.

అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అమృతలూరు (కొల్లూరు): రబీలో సాగు చేసిన అపరాల పంట అయిన మినుములో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు, తగిన సమయంలో నీటి తడులు అందించాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఉయ్యూరు లోకేశ్వరి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోవాడ, యలవర్రు గ్రామాలలో మినుము పంటను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుతం మినుము 30 రోజుల నుంచి 45 రోజుల దశలో ఉన్నందున రైతులు బూడిద తెగులు, పూతకు ఆశించే మారుకా మచ్చల పురుగుల ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంటకు 35 రోజులలోపు తేలికపాటి నీటి తడిని అందించాలని సూచించారు. రబీలో పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వీఏఏలు బి.సాయిమణికుమార్, ఎస్.ప్రవల్లిక పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నకేశవులు, పాల్గొన్న సభ్యులు

తెనాలిరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. తెనాలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 2025–2026 సంవత్సరానికి సంబంధించి అజెండాలో పొందుపరిచిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశానికి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిగిన అనంతరం క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి సంబంధించి చేపట్టబోయే పనులు వాటి అంచనా విలువలు కూడా ఆమోదించారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో నందివెలుగు, కొలకలూరు గ్రామపంచాయతీ నందు రూ. 33 లక్షల అంచనాలతో చేపట్టిన ఐదు పనులు ఆమోదించారు. ఇదే సందర్భంలో ఆర్టీసీ బస్సులు రాత్రి 9:30 తర్వాత గుంటూరు–తెనాలికి బస్ సర్వీసులు ఉండటం లేదని బస్సు సర్వీసులు నడపాలని కొందరు సభ్యులు కోరారు. ఇదే విధంగా హౌసింగ్ కాలనీలో 24 గంటలు విద్యుత్ దీపాలు వెలిగే ఉండడాన్ని సమావేశం దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ అధికారులు అలాగే పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, పరిపాలన అధికారి ఎ. శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపనేని వెంకట్రావు సేవలు మరవరానివి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్


పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్‌లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలను స్థాపించి అనేక మందికి మంచి భవిష్యతును అందించారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పేర్కొన్నారు. నన్నపనేని వెంకట్రావు 45వ వర్ధంతిని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పొన్నూరు శాసనసభ్యునిగా, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసి అందరికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, శ్రీరామరూరల్ విద్యాసంస్థల డైరెక్టర్ కొలసాని తులసీప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఈవో నన్నపనేని భాస్కర్, నన్నపనేని ముకుందరావు, కంఠమనేని సుధాకర్, ధూళిపాళ్ళ సుధాకర్, భాగ్యలక్ష్మి, సుగుణ, ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, అజయ్, పలువురు అధ్యాపకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై బంధువుల ఆగ్రహం

న్యాయం చేయాలంటూ ఆందోళన


గాజుల పావని (ఫైల్)


డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పావని బంధువులు

తెనాలిరూరల్: తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మంగళగిరి మండలం ఎర్రబాలెంకు చెందిన గాజుల పావని మృతి చెందిందంటూ బంధువులు ఆందోళనకు దిగారు. 32 ఏళ్ల పావని ఈ నెల 24వ తేదీన గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అయితే ఆపరేషన్ వికటించి గాజుల పావని మృతి చెందిందని బంధువులు మంగళవారం తెనాలి డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఆపరేషన్ సమయంలో చిన్న పేగుకు, యూరినరీ బ్లాడర్‌కు గాయం చేసి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. పావని శరీరం ఒక్క రోజు వ్యవధిలోనే విషతుల్యమై షాక్‌లోకి వెళ్లిందని వాపోయారు. వెంటనే గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేక మృతి చెందిందని, ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకుని, మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని డీఎస్పీ కార్యాలయం వద్ద నినాదాలతో డిమాండ్ చేశారు. ఇదే విషయమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం ధర్నా అనంతరం కొంత సమయానికి అటు వైద్యులు, మృతురాలి బంధువుల మధ్య చర్చలు జరిగి పరస్పర అంగీకారానికి వచ్చారు. దీంతో ధర్నా విరమించారు. కాగా పావని మృతి విషయమై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది.

మినుము పంట తెగుళ్ల నుంచి కాపాడుకోవాలి

నగరం: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని మంత్రిపాలెం, అల్లపర్రు గ్రామాలలో మంగళవారం వ్యవసాయాధికారులు పర్యటించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మినుము పంటను తెగుళ్ల బెడద నుంచి కాపాడుకోవాలన్నారు. ప్రస్తుత సమయంలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తుందన్నారు.

మురుగు సమస్య పరిష్కరించండి

- మంత్రి మనోహర్‌కు ఐతానగర్ వాసులు వినతి
- పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించిన సచివాలయ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు


మహిళల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: ఐతానగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా ఉందని, దీని వలన దోమల వ్యాప్తి పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆ ప్రాంత మహిళలు కోరారు. పాదయాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం 39,40 వార్డులలో ఆయన పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది పింఛన్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. త్వరలో వాటిని ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీని వెంటనే సస్పెండ్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే పలుచోట్ల మురుగు కాల్వల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు 3,4 వార్డులలో పాదయాత్ర

మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 3, 4 వార్డులలో పాదయాత్ర చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. నందులపేట నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. కౌన్సిలర్లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొనాలని కోరారు.

దళిత సాహిత్యం ఉన్నంతవరకు సజీవులు ఎండ్లూరి సుధాకర్

నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్


సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డెస్క్ సభ్యులు

తెనాలిరూరల్: దళిత సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ఆ సాహిత్యం ఉన్నంతవరకు సజీవులేనని నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులోని బీజేఆర్, అంబేడ్కర్ రీడింగ్ రూంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఆది జాంభవ దళిత ఉద్యోగుల సేవా సమితి(డెస్క్) నిర్వహించిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐటీసీఎల్ డీలర్ యడ్లపల్లి రవి కిరణ్ సారథ్యంలో నిర్వహించిన సభకు డెస్క్ అధ్యక్షులు డాక్టర్ పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కవి కోకిల గుర్రం జాషువా వారసుడిగా దళిత సాహిత్యంలో ఎండ్లూరి తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న డాక్టర్ పొన్నెకంటి విజయ కుమారి, సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఆచార్య ఎండ్లూరి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎండ్లూరి సుధాకర్ రచించిన 'వర్గీకరణీయం' పద్య కావ్యాన్ని సుద్దపల్లి శరత్ వెంకయ్య శబ్ద రూప కావ్యంగా మార్చగా దానిని ముఖ్య అతిథి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెస్క్ ప్రతినిధులు ఉన్నం ఝెహెస్కేల్, ఎస్ మురళీధర్, మేకల రమేష్, కోడూరి సుదర్శన్, ఎస్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

పట్టణ సీఐ మల్లికార్జునరావు



రేపల్లె రూరల్: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూలులో మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని చెప్పారు. క్రమశిక్షణ, ఏకాగ్రతలు కలిగి ఉంటే లక్ష్యాలను సునాయాసంగా చేరుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. ఆధునిక సాంకేతికతను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడరాదని, పరిచయం లేని వ్యక్తులు తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని, వెంటనే తల్లిదండ్రులకుగానీ, ఉపాధ్యాయులకుగానీ తెలియజేయాలని అన్నారు. అనంతరం చిన్నారులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ, స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో ఏబీఆర్ విద్యార్థుల ప్రతిభ



రేపల్లె రూరల్: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గణతంత్ర వేడుకలలో నిర్వహించిన కవాతులో రేపల్లె పట్టణానికి చెందిన ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంగళవారం స్థానిక కళాశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్ మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజున తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఎం.సుప్రియ (బీఎస్సీ తృతీయ సంవత్సరం), పి.గాయత్రీ (బీఎస్సీ ద్వితీయ సంవత్సరం), బి.నాగరాజు (బీకాం ద్వితీయ సంవత్సరం) పాల్గొని ప్రతిభను చాటారన్నారు. కవాతులో అవకాశం అరుదుగా లభిస్తుందని, తమ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనటం అభినందనీయమన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.బాలగురవయ్య, 22వ ఆంధ్రా బెటాలియన్ పీఐ స్టాఫ్, రామరాజు, అనంత సింగ్ తదితరులున్నారు.

నేడు ఓంకార నాదంపై సత్సంగం

రేపల్లె రూరల్: పట్టణంలోని రింగురోడ్డు వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఓంకార నాదంపై సత్సంగం నిర్వహించబడునని నిర్వాహకులు కోడె గౌరీశంకర్, ఎంబీఎల్ నారాయణమూర్తిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమిత్రానంద సరస్వతి మాతాజీ ఓంకార నాద విశిష్టతను వివరిస్తారని, ఆసక్తి కలిగిన పరిసర ప్రాంత ప్రజలు హాజరుకావాలని కోరారు.

రేపు జాబ్ మేళా

రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పట్టణంలోని ఇసుకపల్లి శారద ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్గెట్, డైకిన్, బ్లూస్టార్, తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 100 ఖాళీలు వరకు భర్తీ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం అందజేయబడునన్నారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ ఫొటోలతో రావాలన్నారు. వివరాలకు 90323 84374లో సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్ట్

చందోలు(కర్లపాలెం): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చందోలు ఎస్ఐ ఆర్.స్వామిశ్రీనివాస్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అల్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఎస్ఐ తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.